## క్లుప్తంగా

### ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెను ముప్పు




ప్లాస్టిక్‌కు వ్యతిరేక అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

**అగనంపూడి:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను నేటి తరం గ్రహించాలని దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. ప్లాస్టిక్ నిరోధించడం వల్ల పర్యావరణానికి ముప్పు తప్పుతుందన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు వివరిస్తూ కళాశాల విద్యార్థులతో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యానికి, భూతాపానికి వాయు కాలుష్యంతో పాటు ప్లాస్టిక్ కూడా ఒక కారణమన్నారు. భావి తరాలకు కాలుష్య భూతం ప్రమాదం తప్పాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అసంపూర్తి పనులతో అవస్థలు



దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ఎదురుగా పారుతున్న మురుగు నీరు

**అగనంపూడి:** జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్-1లోని ఇళ్లల్లో వాడుక నీరు దువ్వాడ రైల్వేస్టేషన్ ప్రధాన రహదారి వెంబడి ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సెక్టార్-1లో సుమారు 5వందల ఇళ్ల నుంచి వాడుక నీరు మళ్లించడానికి జీవీఎంసీ డ్రైనేజీ నిర్మిస్తోంది. అయితే వీఎస్ఈజెడ్ గోడ, రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం సమీపంలో డ్రైనేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో మురుగు నీరు రైల్వేస్టేషన్ బస్టాప్ మీదుగా ప్రధాన రహదారి వెంబడి ప్రవహిస్తూ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం పార్కింగ్ వద్దకు చేరుకోవడంతో రైలు ప్రయాణికులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

### చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

**అక్కిరెడ్డిపాలెం:** గాజువాక డ్రైవర్స్ కాలనీలో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని పోలీసులు 108 సహాయంతో కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మరణించాడని గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, బిస్కెట్ కలర్ చెక్స్ షర్టు ధరించి ఉన్నాడని తెలియజేశారు.

### కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**కూర్మన్నపాలెం:** జీవీఎంసీ 86వ వార్డు వుడా ఫేజ్-1లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సరిగ్గా పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు చొరవతో దామా అపార్ట్‌మెంట్స్ పక్కన శనివారం పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, కొత్తది ఏర్పాటు చేశారు.

### విద్యుత్ సమస్యలపై డీఈకి వినతి

**పెదగంట్యాడ:** మండలంలోని గ్రామాల్లో రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు జెర్రిపోతుల ముత్యాలు ఈపీడీసీఎల్ డీఈకి శనివారం వినతిపత్రం అందించారు.

# ఆణిముత్యాలకు నగదు ప్రోత్సాహకాలు



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో లతీష్

**అక్కిరెడ్డిపాలెం:** ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో చేపట్టిన సమూల మార్పులతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆణిముత్యాల వంటి విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వెలుగులోకి వస్తున్నారని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన ఎస్.యశ్వంత్ సూర్యకు రూ.3 వేలు నగదు పురస్కారం, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వి.కార్తిక్, ఎస్.వి.ఎస్.సూర్యలకు ఒక్కొక్కరికి రూ.2 వేల నగదు పురస్కారం, సిల్వర్ మెడల్, సర్టిఫికెట్, తృతీయ స్థానంలో నిలిచిన కె.గాయత్రికి రూ. వెయ్యి నగదు పురస్కారం, బ్రాంజ్ మెడల్, సర్టిఫికెట్లను కార్పొరేటర్ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అందజేశారు. అనంతరం గుడివాడ అప్పన్న కాలనీలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, పీఎంసీ చైర్మన్ వై.సత్యారావు, నాయకులు సంగ్రాన నూకరాజు, నేలపాటి సత్యవతి, నంబారు రాజు, సయ్యద్ హుస్సేన్, తెంటు గోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**అంగన్‌వాడీ చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం**



వేడుకల్లో మాట్లాడుతున్న జెడ్పీ సింహాచలం

**గాజువాక :** ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. జన్ భాగీదారీ కార్యక్రమం పేరిట జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ పి.సింహాచలం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ-01, ప్రీ ప్రైమరీ-02 పూర్తి చేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి సిద్ధంగా ఉన్న చిన్నారులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కేంద్రాల్లో ఆటలు, పాటలతో విద్యను అందిస్తూ చిన్నారుల్లో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంచే విధంగా కృషి చేస్తున్నారన్నారు. ఐసీడీఎస్ పీవో నీలవేణి మాట్లాడుతూ భాగీదారి కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. ఈ స్కూల్ ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్ స్రవంతి, ప్రతినిధులు గీత, బేగం, వాసవ్య మహిళా మండలి సభ్యులు సుశీల, హఫీజా బేగం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నతికి జగనన్న విద్యా కానుక దోహదం



జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ రామారావు

**గాజువాక :** విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకునేందుకు జగనన్న విద్యా కానుక కిట్లు దోహదం చేస్తాయని 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు అన్నారు. వార్డులోని శ్రీనగర్, సుందరయ్య కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లలో యూనిఫారం, స్కూల్ బ్యాగ్, బుక్స్, షూస్, బెల్ట్, సాక్స్‌లు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ తరహా విద్యను అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ప్రతీ విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కటికల కల్పన, నాగేశ్వరరావు, ఐటీఐ సత్యనారాయణ, పప్పల రాజు, గిరి, ఆచారి, డామరోతు అప్పారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యా విధానంపై 20న అవగాహన సదస్సు

**గాజువాక :** యూజీసీ, ఎన్ఈపీ - 2020లో వచ్చిన నూతన విద్యలో భాగంగా దేశవ్యాప్తంగా డిగ్రీ విధానంలో ప్రవేశపెట్టిన మార్పులపై ఈ నెల 20న ఉచిత అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు టీఎస్సార్, టీబీకే కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, ఆంధ్రా యూనివర్సిటీల మార్గదర్శకత్వంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని తెలిపారు. నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీలో భాగంగా సింగిల్ మేజర్, మైనర్ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడం, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, స్కిల్ ఎన్‌హాన్సింగ్ కోర్సులు, మల్టీ డిసిప్లినరీ కోర్సులు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల్లో సందేహాలను ఈ సదస్సులో నివృత్తి చేసుకోవచ్చన్నారు. తమ కళాశాలలో ఉదయం 11 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

**గాజువాక :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ అన్నారు. జేవీవీ సభ్యత్వ నమోదుపై సుందరయ్య కాలనీలో శనివారం నిర్వహించిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేయడానికి జేవీవీ కృషి చేస్తోందన్నారు. శాస్త్రీయ భావజాలం విస్తృతంగా ప్రచారం చేసేందుకు విద్యావంతులు తమ సంఘంలో సభ్యులుగా చేరాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల సిలబస్ నుంచి డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని కేంద్ర ప్రభుత్వం తొలగించడం ద్వారా విద్యార్థుల జ్ఞానాన్ని మొద్దుబారించాలని కంకణం కట్టుకున్నట్టు తెలుస్తోందన్నారు. నూతన విద్యా విధానం -2020 చాలా నష్టదాయకమన్నారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు ఎస్.వి.కె.పరశురామ్, ఎల్.కృష్ణారావు, ఎం.సింహాచలం, రవీంద్రనాథ్, కిరణ్మయి, హైమావతి, లలిత తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

**అగనంపూడి:** తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, నీటి సరఫరా ఒప్పంద కార్మికులు డిమాండ్ చేశారు. ఈ నెల 19 నుంచి జరప తలపెట్టిన నిరవధిక సమ్మెకు సంఘీభావంగా అగనంపూడి కూడలిలో శనివారం ఆందోళన చేపట్టారు. 79, 85 వార్డుల పారిశుధ్య, నీటిసరఫరా ఒప్పంద కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. యూనియన్ నాయకురాలు కె.సత్యవతి మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేదా నెలకు రూ.26వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, బంగారమ్మ, రమణమ్మ, కనకరాజు, ఈశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

**మహారాణిపేట :** ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుల నుంచి చక్కటి స్పందన కనిపించింది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) స్కీమ్ కోసం గత వారం జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ఇచ్చిన ప్రకటనకు స్పందిస్తూ 19 మంది ముందుకు వచ్చారు. వీరికి శనివారం తాటిచెట్లపాలెం ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులకు జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ సలే అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె.మన్మథరావు, డీఆర్‌పీ ప్రతాప్‌కుమార్, ఎస్.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన వేతనాలు అమలు చేయకుంటే సమ్మె

- 26 నుంచి సంతకాల సేకరణ
- జూలై 6న ధర్నా

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాల అమలులో మరింత జాప్యం చేస్తే సమ్మె తప్పదని స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు వారు సీఎండీకి శనివారం వినతిపత్రం అందజేశారు. సెయిల్‌లో నూతన వేతనాలు అమలు జరిగి 20 నెలలు గడిచినా ఇక్కడ మాత్రం అమలు కాకపోవడం అన్యాయమన్నారు. నూతన వేతనాల కోసం ఈ నెల 26, 27, 28 తేదీల్లో సంతకాల సేకరణ చేసి ఉక్కు మంత్రికి పంపుతామన్నారు. జూలై 6న పూర్తి రోజు ధర్నా నిర్వహిస్తామని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి తెలిపారు.

# వెంకన్న ఆలయంలో అన్న సమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. బొబ్బిలి శ్రీనివాసరావు, నాగబాల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు.

## ఉక్కు త్రిశక్తి ఆలయంలో వారాహి నవరాత్రులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో సోమవారం నుంచి వారాహి నవరాత్రులు జరపనున్నారు. ఈ నెల 19 నుంచి 28 వరకు నిర్వహించనున్న పూజల్లో భాగంగా శ్రీమహాదుర్గను తొమ్మిది రోజులు ప్రత్యేక అవతారాల్లో అలంకరించనున్నారు. ఈ నెల 19న అమ్మవారిని ఆదివారాహీదేవిగా అలంకరించి, సహస్ర శ్వేత పుష్పార్చన, 20న లక్ష్మీవారాహీదేవి అవతారంలో సహస్ర గులాబీ పుష్పార్చన, 21న బృహద్వారాహీదేవి అవతారంలో సహస్ర కలువ పుష్పార్చన, 22న లఘువారాహీదేవి అవతారంలో సహస్ర సంపెంగ పుష్పార్చన చేయనున్నారు. అదే విధంగా 23న స్వప్నవారాహీదేవి అవతారంలో శాకంబరి అలంకరణ, 24న ధూమ్రవారాహీదేవి అవతారంలో సహస్ర కమల పుష్పార్చన, 25న వజ్రవారాహీదేవి అవతారంలో సహస్ర చామంతి పుష్పార్చన నిర్వహించనున్నారు. 26న అమ్మవారిని శ్వేతవారాహీదేవిగా అలంకరించి తులసి, మారేడు, శ్వేత పుష్పార్చన, 27న కిరాత వారాహీదేవి అవతారంలో కనకాంబరాలు, వివిధ పుష్పాలతో అర్చన చేయనున్నారు. 28న 108 విశిష్ట ద్రవ్యాలతో వారాహీ మంత్ర హోమ మహా పూర్ణాహుతి నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ తెలిపారు.

# సీఎం జగన్‌కే యువత మద్దతు

**వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కమిటీల్లో నియామకాలు**



యువజన విభాగం అధ్యక్షుడు శివగణేష్

**సాక్షి, విశాఖపట్నం:** రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్న, వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే యువతంతా మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ యువజన విభాగం కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో యువజన విభాగ రాష్ట్ర, జిల్లా, మండల, వార్డు, స్థాయి కమిటీల నియామకాల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన యువకులు, జగనన్న అభిమానులు, పార్టీ యువజన విభాగ కార్యకర్తలంతా ముందుకు రావాలన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించే బాధ్యతను అందరూ తమ భుజస్కంధాలపై వేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తల ద్వారా మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని ఆళ్ల శివగణేష్ విజ్ఞప్తి చేశారు. యువజన విభాగం నాయకుడు జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగిన కాన్టెక్ ఎక్స్‌పో -2023



మాజీ చైర్మన్ కుమార్ రాజాను సత్కరిస్తున్న నిర్వాహకులు

**ఎంవీపీకాలనీ:** బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్టెక్ ఎక్స్‌పో 2023 శనివారం కూడా కొనసాగింది. బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈ ఎక్స్‌పో ద్వారా ప్రదర్శిస్తున్న నిర్మాణ రంగ ఉత్పత్తులను తిలకించేందుకు శనివారం సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డీజీఎన్‌పీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, కోస్ట్‌గార్డ్ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ వర్మ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. వారు స్టాల్స్‌ను తిలకించారు. అనంతరం వారిని నిర్వాహకులు సత్కరించారు. ఈ ప్రదర్శనలో భాగంగా యూనియన్ బ్యాంకు, మహామాయ సిమెంట్, సాగర్ సిమెంట్, వరుణ్ జేసీబీ స్టాల్స్‌ను వ్యాపారులు పెద్ద ఎత్తున సందర్శించారు. ఈ ఎక్స్‌పో ద్వారా 60 స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనలు సాగాయి. ఈ కార్యక్రమంలో బీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్ వెంకటేశ్వర్లు, అఖిల భారత సభ్యుడు రామకోటయ్య, మాజీ చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం :** వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, లక్షల మంది ప్రజలకు పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 856వ రోజుకు చేరుకున్నాయి. మండుటెండను సైతం పట్టించుకోకుండా సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, ఇందుకోసం రాష్ట్రంలోని పార్లమెంట్ సభ్యులందరూ కలిసి పార్లమెంట్ సమావేశాల్లో గళమెత్తాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.